# బ్రతకనేర్చినవాడు

నేను ఉద్యోగంలో చేరిన పావుగంటలో నాతో స్నేహం చేసుకున్న నా సహోద్యోగి రత్నం. అందులో నా ప్రతిభ ఏమీ లేదు. నేను సులువుగా అందరితోనూ స్నేహం చెయ్యలేను. ఒకప్పుడు నేను ఎవరన్నా పలుకరిస్తేచాలు, ముడుచుకుపోయేవాణ్ణి. నాకు "టచ్ మీ నాట్" అని నాతోటి విద్యార్థులు పేరుపెట్టారుకూడా. అయితే నేను స్నేహభావం లేనివాణ్ణి కానని రుజువయినాక ఆ పేరుతో పిలవటం మానేసి పొడిఅక్షరాలతో "టి.ఎమ్.ఎన్" అని, అందరికీ అర్థం కాకుండా పిలుస్తూ వచ్చారు. ఆ "టి.ఎమ్.ఎన్" లక్షణాలు సొంతం పోలేదు.

రత్నం నాకు పూర్తిగా విరుద్ధం. అందుకే మాకు దోస్తీ అంత బాగా కుదిరి ఉంటుంది. అతను ఎటువంటివాడితోనైనా నిమిషంలో స్నేహం చేసుకునేవాడు. ఒక్క నా విషయంలో అతనికి పదినిమిషాలు పట్టింది!

మొదటిసారి పలకరించేటప్పుడే నాతో దీర్ఘమైన పూర్వపరిచయం ఉన్నవాడల్లే పలకరించాడు. ఎంతో అన్యోన్యంగా ప్రారంభమైన మా స్నేహం ఆరోజుకారోజు ఇంకా అన్యోన్యం కాసాగింది. అతని ప్రజ్ఞే – నాదేమీ లేదు.

అతని స్నేహం నన్నేమీ బాధించలేకపోవటం వల్లా, ఆఫీసులో అతను తప్పిస్తే నాకింకో స్నేహితుడు లేనందుచేతా; అతను నన్ను వెంటబెట్టుకుని అంతరిక్షంలో ఎగురుతుంటే నేను అభ్యంతరం చెప్పలేదు.

పైకి నేను ఏమీ అనకపోయినా రత్నం గురించి నాలో ఒకటి తరవాత ఒకటిగా అభిప్రాయాలు ఏర్పడినై. అంతకంటె, మొదట ఏర్పడిన అభిప్రాయం రంగులు మారుతూ వచ్చిందనటం సబబేమో.

"వట్టి పొళ్ళురాయుడు! మనిషి దగ్గర ఏమాత్రం బింకంగాని, బెట్టుగాని లేదు. తనను గురించి ఇతరులేమనుకుంటారో అన్న ఆలోచనే లేదు!" ఇది నా మొదటి అంచనా, రత్నం గురించి.

"నేను కొత్తవాణ్ణిగనకా, నాకు తనను గురించి ఏమీ తెలీదు గనకా నన్ను

పట్టుకున్నాడు. నన్ను ఫూల్ చెయ్యాలనో మోసం చెయ్యాలనో చూస్తున్నాడు. నేను బొత్తిగా వెర్రికుట్టే ననుకుంటున్నట్టున్నాడు" ఇది నా రెండో ఆలోచన.

కొత్తవాణ్ణి గనక నాకు మా ఆఫీసుగొడవలు తెలియనిమాట నిజమే. రత్నం నాకు సహాయం చేస్తూ సలహాలిస్తూ వచ్చాడు. అవి నాకు లాభించాయికూడా. అయితే నామనసులో అతని పట్ల కృతజ్ఞత కలగలేదు. ఆమనిషి సద్బుద్ధిని శంకించాను.

మా ఆఫీసులో అందరిని గురించీ నాకు పూసగుచ్చినట్టు చెప్పాడు. ఫలాని ఫలానివాళ్ళు మంచివాళ్ళు, ఫలాని ఫలాని వాళ్ళు బొత్తిగా స్వార్థపరులు, తమ స్వార్థంకోసం ఏమైనా చేస్తారు - వాళ్ళను గురించి జాగ్రత్తగా ఉండాలి.

అతను చెప్పినదంతా శ్రద్ధగానే విన్నాను. కాని అంతా నమ్మలేదు. స్వానుభవంతో అతనన్నది సరిచూసుకుని ఆ తరువాత అవసరమైతే నమ్మొదామని నా మనసులో నిశ్చయించుకున్నాను.

ఒక్క సౌమిత్రినిగురించే రత్నం చాలా ఘాటుగా చెప్పాడు.

"వాడసలు మనిషికాడు. నీచుడు. కాని తెలివిగలవాడు. అవకాశం దొరికితే వాడు తన తల్లి మెళ్లో పుస్తెలు కాజేసేరకం. వాడి మంచితనం మీద పొరపాటున కూడా ఆధారపడవద్దు, బ్రదర్!"

రత్నం ఇంతఘాటుగా ఎందుకు మాట్లాడుతున్నాడో నాకర్థం కాలేదు. సౌమిత్రి చాలా మంచిమనిషిలాగే కనపడ్డాడు. రెండుమూడుసార్లు మాట్లాడాను. అతనిలో నాకేమీ అవలక్షణాలు కనపడలేదు. మా ప్రొప్రయిటరుకు అతను పర్సనల్ అసిస్టెంటువంటివాడు. ప్రొప్రయిటరు గారి ఆఫీసుపనులూ, ఇంటిపనులూకూడా చూసేవాడు. అతనికి గంటలతో పనిలేదు. అవసరం ఉంటే తెల్లవారుతూనే వచ్చేవాడు. రాత్రి పన్నెండు గంటలకు ఇంటికి వెళ్ళేవాడు. మిగిలిన వాళ్ళకు అతని ఆజ్ఞ ప్రొప్రయిటరు ఆజ్ఞే. అటువంటిస్థితిలో ఉన్న మరొకడైతే మిగిలినవాళ్ళ పైన ఎంత అధికారం చలాయించునో సౌమిత్రిలో అటువంటి అధికార వ్యామోహం నాకేమీ కనపడలేదు.

రత్నం సౌమిత్రిని గురించి పొరబడి అయినా ఉండాలి. లేదా అతనిమీద కక్ష అయినా ఉండాలి. ఈ మాట రత్నం దగ్గర సూచనగా అన్నాను. రత్నం నా అపనమ్మకం చూసి ఆశ్చర్యపోయి, "వాడితత్వం ఎటువంటిదో నీ కొక్క ఉదాహరణ చెబుతాను" అన్నాడు.

సౌమిత్రికి చిన్నతనంనుంచీ డబ్బు యావేనట. పేదకుటుంబమేమో కూడాను. పేద వాళ్ళూ డబ్బు అవసరం ఉన్నవాళ్ళూ ఎందరులేరు? కాని సౌమిత్రి చిన్నతనంలోనే డబ్బుకూ దుర్మార్గానికీ ఏదో సంబంధం ఉన్నదని తెలుసుకున్నాట్ట. ప్రతిఏడూ తన పైక్లాసు పిల్లలతో సావాసంచేసేవాట్ట. పరీక్షపోయి ఫలితాలు తెలియగానే ప్యాసయిన వాళ్ళందరి

దగ్గరికీ వెళ్ళి వాళ్ళ పాతపుస్తకాలు ముష్టెత్తి తెచ్చేవాట్ట. వాటిలో తనకు కావలసినవి ఉంచుకొని మిగిలినవి కాస్త మరమ్మత్తు చేయించి సగం ఖరీదుకు ఇతర పిల్లలకు అమ్మేవాట్ట. వాడి స్నేహితులలో ఒకడు ఒక ప్రెస్సుయజమాని కొడుకు. పుస్తకాల మరమ్మత్తుకు ఈ ప్రెస్సు అక్కరకు వచ్చేది.

సౌమిత్రి నాలుగోఫారం చదువుతుండగా కాబోలు వాళ్ళవూరికి దగ్గరగా ఉన్న పెద్ద కాలవ అవతల మిడిల్‌స్కూలును హైస్కూలు చేశారు. వెంటనే సౌమిత్రి ఇంకొక డబ్బున్న స్నేహితుడితో ఒక ఆలోచన చేశాడు. ఆవూరికి కావలసిన టెక్స్ట్ బుక్కులు నోట్సు పుస్తకాలు తామే అమ్ముదామనుకున్నారు. రెండోవాడు పెట్టుబడి పెట్టిన పాతిక రూపాయల పుస్తకాలు కొన్నాడు. ఇద్దరూ కాలవ దగ్గరికి వచ్చేసరికి పుస్తకాల షాపువాడి మనిషికూడా ఒక పెద్దకొట్టులో హాజరు. సౌమిత్రీ వాడి స్నేహితుడూ కూడబలుక్కున్నారు. బల్లకట్టురాగానే పుస్తకాలషాపు మనిషి తనకట్టతో సహా ఎక్కాడు. సౌమిత్రి వాణ్ణి మాటలలో పెట్టాడు. సౌమిత్రి స్నేహితుడు చూడక తన్నినట్టు పుస్తకాల షాపుకట్టను నడికాలవలోకి తన్నేశాడు. పుస్తకాలషాపు మనిషి లబాయిలూ, దిబాయిలూనూ...! వీళ్ళిద్దరూ వెళ్లి పాతిక రూపాయల పుస్తకాలూ రెండురూపాయల లాభానికి కొత్త స్కూలులో అమ్ముకుని సాయంకాలాని కల్లా తిరిగివచ్చారు.

ఇదీ రత్నం చెప్పిన కథ.

"ఇదంతా నీకెట్లా తెలిసింది?" అని అడిగాను.

"వాడే చెప్పాడు. దాపరికం ఏమీలేదు. వాడి ఉద్దేశం తాను గొప్పపని చేశానని! కావలిస్తే మంచిగా అడుగు నీకూ చెబుతాడు" అన్నాడు రత్నం.

ఏదో వంక పెట్టుకుని సౌమిత్రచేత ఈ కథ చెప్పించాను. సౌమిత్రి ఏమీ దాచకుండా అంతాచెప్పి, షాపువాడి మనిషి మూట నీటిలో పడిపోయిన సంగతి చెబుతూ కళ్ళనీళ్ళు కారేదాకా నవ్వాడు.

"వోరిపశువా!" అనుకున్నాను.

"నువుచెప్పింది నిజమేనోయ్!.. మొత్తానికి ఈ సౌమిత్రిగాడు బతకనేర్చినవాడే!" అన్నాను.

"వాడా? వాడితలకాయి! బతకనేరవటమంటే మానవత్వం ఉండాలి. వాడికి నాకన్న హెచ్చుజీతం, కాని నేను వాడికన్న ఎక్కువ సంపాదిస్తాను–" అన్నాడు రత్నం.

"నువ్వా?" అన్నాను ఆశ్చర్యంతో.

"అవును, అందుకు చాలా పద్ధతులున్నై. అవి బయటపెట్టేవి కావు" అన్నాడు రత్నం.

వాటిలో ఒకటి నా అంతటనేనే కనుక్కున్నాను.

మా ఆఫీసులో రెండు చిట్‌లున్నై. ఒకటి నూరురూపాయలది, రెండోది నూటయాభై రూపాయలది. మొదటి దానిలో పదిమందీ రెండోదానిలో పదహేనుమందీ ఉన్నారు. నేనే ఒక్కణ్ణి కావటంచేత నూరు రూపాయలదానిలో చేరాను. జీతం వచ్చేరోజున ఎవరి అవసరాన్ని బట్టి వాళ్ళు తక్కువకు పాడుకుంటారు. అందరికన్న తక్కువ పాడినవారికి పాడినంత మొత్తం పోతుంది. దాన్ని మిగిలినవాళ్లు సమంగా వేసుకుని ఇచ్చుకుంటారు.

మూడు నెలలపాటు నాకు డబ్బు అగత్యంరాలేదు. అగత్యంపడిన వాళ్లు ఏ ఎనభైకో డెబ్భైకో పాడేసేవాళ్ళు. మిగిలినవాళ్ళు తాము ఇచ్చుకోవలసిన పదిలో రెండూ, మూడూ ఆదా చేసుకునేవాళ్ళు. డబ్బు అవసరం గలవాళ్ళు హెచ్చు ఉన్నరోజున పాట పాపం పెరిగినట్లు పెరిగేది కాదు – తరిగేది.

నాబుద్ధికి ఈ పాట చాలా అమానుషంగా కనిపించింది. ఒకనెల ఒక అతనిఇంట్లో అందరూరోగాలతో తీసుకున్నారు. డాక్టరు బిల్లుకూ, మందులకూ అతని జీతంకూడా చాలదు. ఆ నెలాఖరున అతను అరవైరెండు రూపాయలకు పాటపాడాడు. అతని అవసరం గుర్తించి ఇద్దరు తమకు డబ్బు అవసరం లేకపోయినా పాడించారు. “అరవైరెండు” అనేటప్పుడు అతనిముఖంలో జీవంలేదు. తనను మిగిలినవాళ్లు అడవి జంతువును వేటకుక్కలు తరిమినట్టు తరుముతున్నారని అతనికి తెలుసు, కాని ఏమీ చెయ్యలేదు.

చిట్ అంటే ఇతరుల అవసరాన్ని క్రూరంగా దోపిడీచెయ్యటం – సహకార విధానాన్ని అవలంబించిన రక్తదాహం!

ఈ చిట్‌లలో రత్నం ఎందుకు చేర నిరాకరించాడో నాకు అర్థమయింది. కాని వేలంపాడే చోటికి ఎందుకు పనిపెట్టుకుని వచ్చేవాడో నాకర్థంకాలేదు.

నాలుగోనెలలో నాకు డబ్బు అవసరమయింది. మరీ పెద్దపోటీ లేకుండా ఉంటే ఏ ఏనభైకో అయితే పాడేద్దామనుకున్నాను. ముందుగా ఏమాత్రం తెలిసినా పాట పెంచేస్తారని నా అవసరం గురించి ఎవరితోనూ చెప్పలేదు. రత్నంతో మాత్రం చెప్పాను.

“నీకు నిజంగా డబ్బు అవసరమా ఏమిటి?” అన్నాడతను.

నా అవసరం ఏమిటోకూడా అతనికి చెప్పేశాను.

“అయితే భయపడకు, నీ చిత్తంవచ్చినట్టు పాడు. నేను ఆగమన్నప్పుడు మాత్రం ఆగు! నాకేసి చూస్తుండు – నేను సంజ్ఞ చేసినప్పుడు విరమించు” అన్నాడు రత్నం.

అతని ఉద్దేశం నాకర్థం కాలేదు.

“ఎనభైకంటె పాటతగ్గితే ఆగుదామనుకుంటున్నాను” అన్నాను. “ఎనభైకి ఆగదులే, అరవై అయిదుదాకా భయం ఉండదు. తరువాత నన్ను కనిపెట్టి ఉండు” అన్నాడతను.

"ప్రతినెలా రెండూ, మూడు ఆదా అవుతున్నది గనక ఎనభైదాకా నాకు నష్టంఉండదు. అంతకంటె తగ్గితే–"

"నీకు నష్టంరాకుండా చూసే పూచీనాదీ!" అన్నాడు రత్నం.

ఎందుకో నాలో అతనిపైన చప్పున నమ్మకం కుదరలేదు. అయినా అతని సలహా పాటించటానికే నిశ్చయించాను.

పాట ప్రారంభమయింది. లోగడ తీసుకున్న ముగ్గురుగాక మిగిలిన ఏడుగురం పాటలో ఉన్నాం. పైవాళ్ళు ఇద్దరు, ముగ్గురున్నారు. వాళ్ళలో రత్నంకూడా ఉన్నాడు మామూలు ప్రకారం.

అసలువాణ్ణి నేను నోరెత్తకముందే రేచులల్లే తగులుకుని గబగబా మొత్తాన్ని డెబ్భైరెండుకు దించారు. నాకు డబ్బు అవసరంవచ్చినప్పుడే అందరికీ అవసరం కావటం నాకు ఆశ్చర్యం కలిగించింది. కాని ఆ పాడేవాళ్ళలో ఇద్దరుముగ్గురు నాకేసి చూస్తుండటాన్ని బట్టి నా అవసరం వాళ్ళు పసికట్టారా అన్న అనుమానం కలిగింది నాకు.

కాని వాళ్ళకు ఎవరు చెబుతారు? రత్నం చెప్పాలి. అతనికేసి చేశాను పాడమన్నట్టు సంజ్ఞచేశాడు. ఏడుగురిలోనూ ముగ్గురే ఎందుకు పాడుతున్నారో నాకర్థం కాలేదు.

నేను నోరు జారినవాడల్లే "అరవైఅయిదు" అన్నాను.

ఎవరో చప్పున "అరవై" అన్నారు.

నేను రత్నంకేసి చూశాను. అతను పాడవద్దని సంజ్ఞచేశాడు. అందరూ నాకేసి చూస్తున్నారు. నేను రాయల్లే బిగుసుకు పోయినాను. అరవైకి పాటకొట్టేశారు. "అరవై" అన్నవాడి మొహం చూసితీరాలి. అక్కడే బావురుమని ఏడిచేస్తాడనుకున్నాను.

తరువాత రత్నం నాకు నూరు రూపాయలిస్తూ, "నీ వంతు వచ్చినప్పుడు ఇచ్చెయ్యి" అన్నాడు.

"నూటికి నూరు వస్తాయని ఏమిటి? పాటవుంటే?" అన్నాను.

"పాట ఉండదులే!" అన్నాడతను ధైర్యంగా.

"ఎవరూ పాడకపోయినా నామకార్థం రెండురూపాయలు తీసేస్తారు" అన్నాను.

"సరే అప్పుడా రెండురూపాయలూ ఇచ్చేద్దుగాని" అన్నాడతను.

తరువాత రెండునెల్లే పాటసాగింది. పాడేవాళ్ళ సంఖ్య బొత్తిగా తీసిపోయింది.

అసలు సంగతి ఆరునెలలు గడిచాక బయటపడింది. గడిచిన ఆరునెలల కాలంలోనూ పాడుకున్న వాళ్ళు తమమొత్తాలు పాడుకుని తీసుకోగా చివరదాకా పాడి పోయినవాళ్ళ మొత్తాలు వాళ్ళకు చెల్లించి వాళ్ళ అవసరాలు తీర్చి వాళ్ళవంతులు తనపేర రాయించుకున్నాడు రత్నం.

పెద్ద చిట్‌లకి కూడా ఇదేపని చేశాట్ట!

ఎవరూ నష్టపడ్డట్టు భావించలేదు. అతని దగ్గర డబ్బుతీసుకున్న వాళ్ళు తమ అవసరాలు గడుపుకోవటమే గాక పాటలో తమను వోడించిన వాళ్ళకన్న రెండోమూడో ఎక్కువే చేజిక్కించుకున్నారు. వాళ్ళకు లాభించింది.!

రత్నంచేసిన పనికి ఆగ్రహించినవాళ్ళు పాడి గెలుచుకున్నవాళ్ళే.

"రత్నం చేసినపని చాలా అన్యాయం" అన్నారు వాళ్ళు.

"నెలకు ఇద్దరి అవసరాలు తీరే ఏర్పాటు చేశాననా?" అన్నాడు రత్నం.

"చిట్‌లు లేనివాడు లాభంపొందటం చాలా అన్యాయం" అన్నారు.

"నన్ను బొత్తిగా పరాయివాడికింద కట్టెయ్యకండి. మనవాడు చాలా డబ్బుయిరకాటంలో ఉన్నాడని నేను చెబితేనేకద, అతను నోరు తెరవకుండానే మీరంతాచేరి పిచ్చెత్తినట్టు పాడారు!" అన్నాడు రత్నం.

"ఏదో స్నేహపూర్వకంగా నడుపుకుంటున్న చిట్‌ను నువు ఇలా చెయ్యటం ఏమీ బాగాలేదు" అన్నారు.

"అసలు మీ చిట్ ఉద్దేశమే నాకు బాగాలేదు. మీ అంతరాత్మలు సంతృప్తి పరచటానికి ఈ మిగిలిన ఆరునెలలు ఎవరో ఒకరిచేత తొంభై ఎనిమిది అనిపించి ఆ డబ్బు నేనే పుచ్చుకుంటాను. మీదుఃఖమంతా పాట పెంచేవాళ్ళు లేరనే, కనక మీరు బాధపడుతున్నది లోభంతో కాదని నన్ను నమ్మించకండి. నేను అబద్ధాలు నమ్మను!" అన్నాడు రత్నం.

***ముద్రణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 1 జూన్ 1960***